
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 6
సంపుటి : 3, సంచిక : 312 | నవంబర్ 19, 2025 | వెల : రూ.3-00



ఆవాసంలో చక్కటి విద్యాబోధన

3లో..





# 'హుజూరాబాద్'.. కేంద్ర పాలిత ప్రాంతమా!?




- ఎక్కడేసిన గొంగడి అక్కడే..అనేలా పరిస్థితులు!
- సమస్యలు పరిష్కరించే నాయకత్వం కరువు!
- 'ఎవరికి వారే' యమునా తీరేలా లీడర్ల తీరు!
- నియోజకవర్గ ప్రజల గోడు వినే నాథుడే లేడా?

**వేద న్యూస్, కరీంనగర్ ప్రతినిధి:**

'మేడిపండు చూడ మేలిమై ఉండు..పొట్ట విప్పి చూడు పురుగులుండు' అనేలా హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల పరిస్థితులు ఉన్నాయి.! అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో జనం సమస్యలు పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోతున్నారు. విలక్షమైన తీర్పునిచ్చే నియోజకవర్గంగా రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా పేరు సంపాదించుకున్న 'హుజూరాబాద్'లో అభివృద్ధి జాడ అంతంత మాత్రమేనని, మౌలికమైన మార్పులు పెద్దగా లేవని స్పష్టమౌతోంది.

**– సామాన్యుల సంగతి గింతేనా?**

విలక్షణమైన తీర్పు ద్వారా ప్రజలు నాయకుడికి జై కొట్టిన తర్వాత సదరు నాయకత్వం నియోజకవర్గంలో తెచ్చిన మార్పు, చేసిన పనులు ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి.!అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో సామాన్యులకు గత సర్కారు హయాంలో నిర్మించిన 'డబుల్' ఇండ్ల పరిస్థితి అయితే ఆగమ్యగోచరంగా మారింది. రూ.వేల కోట్లు వెచ్చించి కట్టిన నిర్మాణాల్లో ఐరన్ మాయమవుతోంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కొన్ని చోట్ల ప్రజలు అక్కడికి వెళ్లి ఉన్నా కనీస సౌలతులు లేక అరిగోసలతో అష్టకష్టాలు పడుతున్నారు. ఈ సంగతిని నికరంగా పట్టించుకునే నాథుడెవరనే ప్రశ్న బాధితులను వెంటాడుతోంది. అధికార పార్టీ ఇన్‌చార్జి కానీ శాసన సభ్యుడు కానీ తమ పార్లమెంటు సభ్యుడు కానీ ఎవరైనా సరే.. ఈ విషయమై చొరవ చూపేవారే లేరా? అని మధనపడుతున్నారు.

**– తరచి చూస్తే..అన్నీ సమస్యలే!**

నియోజకవర్గ పరిధిలోని ప్రతీ ప్రాంతాన్ని తరచి చూస్తే.. చాలు అన్ని సమస్యలు ఇట్టే కనబడుతాయి.! సాధారణ జనం తమను పట్టించుకునే వారు లేరని..బాధపడుతున్నారు. ఈ సంగతి క్షేత్రస్థాయిలో అడుగు పెడితేనే తెలుస్తుందని పలువురు చెబుతున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఇల్లందకుంట మండలం ఏర్పడి తొమ్మిదేండ్లు దాటుతున్నా పూర్తిస్థాయిలో వసతుల్లేని భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అపరభద్రాద్రిగా పేరుగాంచిన సీతారామచంద్రుడు కొలువుదీరిన మండలకేంద్రంలోనే ఈ పరిస్థితి నెలకొంది. ఇక హుజూరాబాద్ నియోజ కవర్గకేంద్రానికి అతి సమీపంలోకి డంపింగ్ యార్డు వస్తోంది. దాంతో వచ్చే ఇబ్బందులపై జనం ఆందోళన చెందుతోంది. ఇక వైద్యం విషయమై జనం ప్రభుత్వాస్పత్రులకు వెళ్లాలంటేనే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. కనీసంగా ఎక్స్‌రే పరికరం లేదు. స్పెషలిస్టు డాక్టర్ల ఊసే లేదు. 'పేరుకు పెద్ద.. కానీ వసతులు, సేవలు సున్నా' అన్నట్టుగా నియోజకవర్గంలోని సర్కారీ దవాఖా నల పరిస్థితులున్నాయి. వీటన్నింటిపైన ప్రశ్నించే నాయకత్వం ఏది లేదు..? కానీ, మూడు ప్రధాన పార్టీల్లో మాత్రం వర్గ'పోరు'కు మాత్రం కొదవ లేదు. అధికార పక్షంగానో, ప్రతిపక్షంగానో, లేదా ప్రజాపక్షంగానో, ఏదో ఒక పక్షంగానో ప్రజా సమస్యలపై అడిగే వారు ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానం మాత్రం.. 'మౌనం' వస్తుండటంతో ఒకింత సామాన్యులు అసహనం వ్యక్తం చేసే పరిస్థితులున్నాయి. హుజూరాబాద్ 'కేంద్ర పాలిత ప్రాంతమా?'..అలా మారిందా? అనే అనుమానాలు కలుగక మానదని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సమగ్ర అభివృద్ధి, ప్రజల కోణంలో సంక్షేమం, సామాన్యుల గోడు పట్టించుకునే విషయాలపై నాయకులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

## కరెంటు నుంచి కాంట దాకా సమస్యలే..!



**– మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని బీఆర్ఎస్ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ని హరీశ్ రావు మంగళవారం సందర్శించారు. పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు. రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారన్నారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, బీజేపీ తప్పుడు విధానాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. సీసీఐ తుగ్లక్ వంటి పిచ్చి నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నదని ఎల్1, ఎల్2, ఎల్3 విధానం, కపాస్ యాప్‌లో 8 నుంచి 12 శాతం తేమ ఉండాలనే నిర్ణయాలతో రైతులు రోడ్ల మీద పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయన్నారు. పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారు. ఈరోజు రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవకాశం లేక అడ్డగోలుగా దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. పత్తికి మద్దతు ధర రూ. 8,100. కానీ, రూ.6 వేలకే రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. క్వింటాల్ మీద రూ.2000ల చొప్పున పత్తి రైతులు నష్టపోతున్నారు.

# త్వరలో పర్మిషన్స్

- తెలంగాణ సీఎం విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూల స్పందన
- మెట్రో విస్తరణ, మూసీ ప్రాజెక్టులకు అనుమతులు కోరిన రేవంత్
- హైదరాబాద్‌లో పట్టణాభివృద్ధి శాఖల మంత్రుల ప్రాంతీయ సదస్సు
- ముఖ్య అతిథిగా హాజరైన సెంట్రల్ మినిస్టర్ మనోహర్ లాల్ ఖట్టర్

**వేద న్యూస్, డెస్క్:**




ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా భారత్ ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంలో తెలంగాణ కూడా భాగస్వామ్యం కావాలని బలంగా ఆకాంక్షిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి సంపూర్ణ సహకారం, మద్దతు కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ లో జరిగిన తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్ డ్యూల పట్టణాభివృద్ధి శాఖల మంత్రుల ప్రాంతీయ సదస్సును కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

**– 2047 నాటికి గొప్ప దేశంగా 'భారత్'**

ఈ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దేశం స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాల పూర్తి చేసుకునే 2047 నాటికి ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు నడిపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత్ భారత్

మిగతా 3వ పేజీలో..

## కోటి మంది మహిళలకు సిరిసిల్ల చీరలు..!

**- రెండు దశల్లో చీరల పంపిణీ - నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేసే ఇందిరమ్మ చీరలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం అమలుపై మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతీ మహి

మిగతా 3వ పేజీలో..



## శభాష్ ఎషా సింగ్

- ఒలింపిక్స్‌లో తొలి కాంస్యం
- రెండు రజతాలతో తెలంగాణ గర్వం
- ప్రజాభవన్‌లో సీతక్కను కలిసిన ఎషా

**వేద న్యూస్, హైదరాబాద్ :**

అంతర్జాతీయ వేదికపై భారత పతాకాన్ని ఎగురవేసిన తెలంగాణ బిడ్డ ఎషా సింగ్ విజయాలను మంత్రి దానసరి సీతక్క అభినందించారు. ప్రజాభవన్‌లో సీతక్కను కలిసి శుభాకాంక్షలు అందుకున్న ఎషా, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో భారత ఒలింపిక్ చరిత్రలో తొలి కాంస్య పతకాన్ని సాధించి కొత్త రికార్డు సృష్టించడం విశేషమని సీతక్క పేర్కొన్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ మరియు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగాల్లో ఎషా సింగ్ మరో రెండు రజత పతకాలను గెలుచుకోవడం తెలంగాణకు, దేశానికి గర్వకారణమని ఆమె అభినందించారు. ఒలింపిక్ స్థాయిలో ఇటువంటి ప్రతిభ కనబరచడం యువతకు స్ఫూర్తిదాయకమని సీతక్క పేర్కొన్నది. దేశ కీర్తి కోసం ఎషా సింగ్ మరెన్నో పతకాలు సాధించాలని కోరుకుంటున్నామని సీతక్క తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎషా భారత్‌కు మరిన్ని విజయాలు, ఆనందాలు అందిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## హిందుత్వంపై గర్వంగా మాట్లాడతా

**– సివిలైజేషనల్ రూట్స్ మన బలం: బండి సంజయ్**

**వేద న్యూస్, హైదరాబాద్ :**




కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ హిందుత్వ, సనాతన ధర్మంపై తన దృఢమైన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. సనాతన

మిగతా 3వ పేజీలో..

## మావోయిస్టు అగ్రనేత
# హిడ్మా మృతి..!



**వేద న్యూస్, డెస్క్:**

ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు – మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పులలో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లుగా తెలుస్తోంది. కాగ మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా కూడా ఉన్నారు. మృతి చెందిన హిడ్మా సెంట్రల్ కమిటీ సభ్యుడు కాగా, ఆయన భార్య మడకం రాజే అలియాస్ రాజక్క డివిజన్ కమిటీ మెంబర్ గా కొనసాగుతున్నారు. భద్రతా బలగాలు ఆపరేషన్ హిడ్మా పేరిట ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. హిడ్మా కోసం గత నెలరోజులుగా భారీ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం మావోయిస్టుల్లో ఉన్న మిగిలిన కీలక నేతల కోసం కూడా గాలిస్తున్నట్లుగా భద్రతా బలగాలు తెలిపాయి.

## గోడ దూకి పారిపోయిన ఎస్ఐ..!

- వెంబడించి పట్టుకున్న ఏసీబీ అధికారులు




**వేద న్యూస్, టేక్మాల్ :**

మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్ లో ఒక వింతైన ఘటన చోటుచేసుకుంది. ఓ ఎస్ఐ తన పోలీస్ స్టేషన్ గోడ దూకి పారిపోయాడు. ఒక కేసుకు సంబంధించి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఎస్ఐ రాజేశ్ ఏసీబీ అధికారులకు పోలీస్ స్టేషన్ లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సమయంలో అక్కడి నుంచి స్టేషన్ గోడ దూకి ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకొని పారిపోగా ఎస్ఐ రాజేశ్ ని వెంబడించి, చివరికి ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అయితే, ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్ఐ ఏసీబీకి చిక్కడంతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్న స్థానికులు పోలీస్ స్టేషన్ ముందు టపాసులు కాల్చారు.

# హరిత అస్త్రం.. 'హంటర్'

- చెట్టు నరికితే పట్టేస్తుంది..
- ఫారెస్ట్ ప్రొటెక్షన్, నేర పరిశోధనలో కీలక పాత్ర
- వేటగాళ్ల సింహస్వప్నం.. 'మాలినోయిస్ బెల్జియన్ షెపర్డ్




**వేద న్యూస్, డెస్క్:**



'హంటర్ డాగ్'.. ఈ పేరు వింటే.. స్మగ్లర్లు, వేటగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తాల్సిందే.. సదరు అటవీశాఖ జాగిలం 'హంటర్ డాగ్' సీన్‌లోకి ఎంటరయితే చాలు..కాకలు తీరిన స్మగ్లర్లు, వేటగాళ్లు, అడవి దొంగలు ఎవరయినా సరే.. కలుగులో దాక్కున్నా.. బయటకు రావాల్సిందే. వారి గుట్టు రట్టు చేసి వారిని కోర్టు ఎదుట నిలబెడుతుంది ఈ డాగ్. అటవీ కలపను అక్రమంగా కొట్టేసి రవాణా చేసేందుకు ఎంతటి రహస్య ప్రదేశంలో దాచిపెట్టినా ఆ జాడనూ కనిపెట్టగలదు. హంటర్ డాగ్‌ను అక్కడికి తీసుకెళ్లి వాసన చూపించి వదిలిపెడితే చాలు.. అది కి.మీ. పరిధిలోని దూరాన్ని సైతం ట్రాక్ చేస్తూ..కలప లేదా అటవీ సంపదను, అది కాజేసిన వేటగాడిని గుర్తిస్తుంది. వేటగాళ్ల సింహస్వప్నంగా మారి.. చెట్టు నరికితే ఇట్టే పట్టించేసే.. వేటగాళ్లను చిత్తు చేసే సదరు 'హంటర్ డాగ్' విశేషాలివే..

**'హంటర్' ఎంటరయితే..వేటగాళ్లు చిత్తే..**

పులులు, చిరుతలు, జింకలు, పక్షులు, సరీసృపాలు, ఇంద్రజాల రంగు కలిగిన చిపుమందుల వరకు.. అక్రమంగా రవాణా చేస్తున్న కేసులు ప్రతి ఏటా పెరుగుతున్నాయి. ప్రపంచ వన్యప్రాణుల నిధి (డబ్ల్యాడబ్ల్యూఎఫ్) ప్రకారం.. 2022లో సుమారు 4,000 జంతువులు దేశవ్యాప్తంగా సీజ్ చేయబడ్డాయి. ఈ ఆందోళనకర పరిస్థితుల్లో తెలంగాణలోని కవాల్ టైగర్ రిజర్వ్ కొత్త 'హరిత' అస్త్రాన్ని సన్నద్ధం చేసుకుంది.. అదీ "హంటర్" అనే సూపర్ స్నిఫర్ కుక్క.

**అటవీ రక్షకుడు..'హంటర్'**

ఈ జాగిలం ఇప్పుడు రాష్ట్ర అటవీ శాఖలో వన్యప్రాణుల రక్షణకు ప్రతీకగా నిలుస్తోంది.అడవుల్లో ఆపరేషన్ హంటర్ జన్నారం ఫారెస్ట్ డివిజన్‌కి చెందిన "హంటర్" మాలినోయిస్ జాతికి చెందిన బెల్జియన్ షెపర్డ్. ఏడు నెలల కఠిన శిక్షణను పూర్తి చేసి, 2025 లో కవాల్ టైగర్ రిజర్వ్‌లో సేవలు ప్రారంభించింది. హర్యానాలోని పంచకులలో నేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ డాగ్స్ (ఎన్‌టీసీడీఎ) వద్ద శిక్షణ పొందిన ఈ కుక్క ఇప్పుడు అడవిలో స్నేహపూర్వక రక్షకుడిగా, వేటగాళ్లకు భయానక గాథగా మారింది. హంటర్ ప్రధాన హ్యాండ్లర్ ఎల్.అనిల్‌కుమార్, సహాయకుడు పరమేశ్వర్.. ఇద్దరూ అటవీ శాఖ అధికారులు. వారు 'హంటర్'ను అడవులలో చుట్టూ తీసుకెళ్లి వేట లేదా అక్రమ కలప రవాణా, లేదా నిషిద్ధ జంతువుల మాంసం చేర్చిన కేసులలో సాక్ష్యాల కోసం వాడుతారు. ఇటీవల 'హంటర్' పనితీరుతో అనేక నేరస్థులు పటుబడ్డారని అటవీ శాఖ వర్గాలు చెబుతున్నాయి. వాసనతో వేటా, నేరంపైనా పట్టుబడే హంటర్ 'బెల్జియన్ షెపర్డ్' జాతి కుక్కల శక్తి వాసన పట్ల అద్భుతమైన ప్రతిస్పందన. 'హంటర్' కూడా అదే లక్షణాన్ని చూపిస్తున్నది. నేరస్థులు వదిలిన చొక్కా లేదా కత్తి వంటి వస్తువుల వాసనను గుర్తించి కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యక్తిని కూడా వెతికి పట్టుకోగలదు. అలాగే పులి, చిరుత, హరిణ చర్మాలు, జింక మాంసం వంటి నిషేధిత వస్తువులను కూడా ఇది వాసన ద్వారానే గుర్తిస్తుంది. అందువల్ల 'హంటర్' కేవలం ఒక కుక్క కాదు, అడవిలో నడిచే నేర అన్వేషి. హం టర్ ఇటీవల జాతీయ స్నిఫర్ డాగ్ పోటీలో మూడో స్థానం సాధించింది, ఇది దానికి ఉన్న శిక్షణా ప్రమాణాన్ని తెలియజేస్తుంది.

**హరిత సం'రక్షణ'లో కీ రోల్**

అర్ధరాత్రి అడవిలో చెట్టును కొట్టేసినా ఎవరూ పట్టుకోరనే ధీమా 'హంటర్ డాగ్' ఎఫెక్ట్‌తో..ఇక చెల్లదు. 'హంటర్ డాగ్' అలాంటి వారి ఆట కట్టిస్తోంది. ఇప్పటికే ఇద్దరిని జైలుకు పంపడంలో కీలకపాత్ర పోషించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం, జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట రేంజిలోని తానిమడుగు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు విలువైన టేకు చెట్లను నరికారు. వారిని పట్టుకునేందుకు జన్నారం అటవీ డివిజనల్ అధికారి అనుమతితో తాళ్లపేట రేంజి అధికారి డాగ్ స్క్వాడ్ బృందాన్ని రంగంలోకి దించారు. హంటర్ డాగ్.. 4కిలోమీటర్ల దూరం వరకు ట్రాక్ చేస్తూ..వెళ్లి వేటగాడి వరకు వెళ్లి ఆగింది. అతని ఇంటి వద్ద టేకు కలప సైతం లభించింది. వేటగాళ్లను హంట్ చేస్తూ.. హరిత సంరక్షణకు కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. కాగా, ఇలాంటి 'హంటర్ డాగ్'లను తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా అటవీ సంరక్షణకు అన్ని రాష్ట్రాల అటవీ శాఖలు ఉపయోగించుకోవాలని, ఆ మేరకు కేంద్రప్రభుత్వం సైతం చొరవ చూపాలని, అటవీ సంరక్షణ అంటే భవిష్యత్‌కు పెటుబడి అనే విషయాన్ని గుర్తించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

**అటవీ నేరాలకు అడ్డుకట్ట**

భారతదేశంలో అటవీ నేరాలను అరికట్టడానికి డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా, ట్రాఫిక్ సంస్థలు 2008లో "సూపర్ స్నిఫర్" కార్యక్రమాన్ని ప్రారం భించాయి. మొదట రెండు కుక్కలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రస్తుతం 20 రాష్ట్రాలకు విస్తరించి 120 స్నిఫర్ కుక్కలకు శిక్షణ ఇచ్చింది. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లోని 'హంటర్' వంటి కుక్కలు కీలక భాగమయ్యాయి. ఈ జాగిలాల శిక్షణ వెనుక ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే.. వాటిని ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) అధికారుల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారు. ట్రైనింగ్ పూర్తి అయిన తర్వాత, జాగిలాలు, వాటి హ్యాండ్లర్లు కలిపిన బృందాలు తిరిగి తమ రాష్ట్రాలకు పంపబడతాయి. తెలంగాణలో అటవీ సంరక్షణకు కొత్త ఉత్సాహం..కవాల్ టైగర్ రిజర్వ్‌లో 'హంటర్' మోహరింపు.. తెలంగాణలో ఒక ముఖ్యమైన మైలురాయి. వన్యప్రాణి సంరక్షణ శాఖ గతంలో 'చీతా' అనే స్నిఫర్ కుక్కను వినియోగించింది. ఇప్పుడు 'హంటర్' ఆ వారసత్వాన్ని కొనసాగిస్తున్నది. 'హంటర్' పనితీరుతో హైదరాబాద్, మంచిర్యాల, నిజామాబాద్ ప్రాంతాల అటవీ నియంత్రణలో కూడా పర్యవేక్షణ బలపడుతోంది. ఇలాంటి 'స్నిఫర్ డాగ్‌లు' కేవలం వన్యప్రాణులను కాపాడడమే కాకుండా, స్థానిక సమాజాల్లో అవగాహన కూడా పెంచుతున్నాయి. గ్రామాల్లో 'హంటర్' పహారా చూసే సమయాల్లో.. పిల్లలు, యువకులు ఈ కుక్కల పాత్రను ఆసక్తిగా గమనిస్తూ.. అటవీ సంరక్షణ పట్ల కొత్తగా ఆలోచించడం మొదలు పెడుతున్నారు. పులుల మనుగడకు రక్షకుడైన 'హంటర్'ను తెలంగాణలో మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా కూడా ఆచరణలోకి తీసుకురావడం అత్యవసర అంశం.

**పులుల మనుగడకు రక్షకుడు 'హంటర్'**

వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ సొసైటీ ఆఫ్ ఇండియా సమాచారం ప్రకారం.. ఈ ఏడాది ఇప్పటి వరకు 122 పులులు మరణించగా, 40 వేట కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య గతేడది కంటే అధికం. ఇలాంటి పరిస్థితుల్లో 'హంటర్' లాంటి స్నిఫర్ కుక్కలు అటవీ శాఖలకు ఆయుధంగా మారాయి. వీరి సహాయంతో వేటగాళ్ల చరుగులపై వేగంగా స్పందించవచ్చని అధికారులు చెబుతున్నారు. హంటర్ వంటి స్నిఫర్ కుక్కలు మన అటవీ సంరక్షణలో మానవ సహకారం, సాంకేతికత కలిసిన ప్రతీకలు. హంటర్ కథ, తెలంగాణ మాత్రమే కాదు..భారత్ వన్యప్రాణులను రక్షించే ప్రతి కర్తవ్యపరుడి గర్వకథ కూడా.



- అంబీర్ శ్రీకాంత్,
జర్నలిస్టు,సెల్: 81859 68059.

# వరంగల్ కు జల సంచాయ్-జన్ భాగీదారి అవార్డు

- జాతీయస్థాయిలో విరాజిల్లిన వరంగల్ ఖ్యాతి
- అవార్డు లభించడంపై సంతోషం వ్యక్తం చేసిన కలెక్టర్ డా.సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

మరోసారి జాతీయ వేదికపై వరంగల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. వరంగల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయి–జన్ భాగీదారి అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం జల్ శక్తి అభియాన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో 2024–2025 సంవత్సరానికి సంబంధించి "జల సంచాయ్ –జన్ భాగీదారి 1.0" అవార్డుకు దక్షిణ భారత దేశంలో జల సంరక్షణ కేటగిరి – 2 లో వరంగల్ జిల్లాకు తొలి స్థానం దక్కిన తరుణం లో మంగళ వారం డిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రివర్యులు సి.ఆర్. పాటిల్ చేతుల మీదుగా వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అవార్డు స్వీకరించారు. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పందిస్తూ, జిల్లాకు జలసంచాయ్–జన్ బాగీదారిలో తొలి స్థానం దక్కడంతో పాటు అవార్డు లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల సమష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘన సాధ్యమైందని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులను జిల్లాలోని ప్రజల భాగస్వామ్యంతో 42,342 ఇంకుడు గుంతలు, 8,013 సేద్యపు కుంటలు, 260 చేప పిల్లల పెంపకం కుంటలు, మట్టి కట్టలు, రాక్ పిల్ డ్యామ్ లు, కాంటూరు కందకాలు రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, బోరు బావుల పునరుద్దరణ పనులు, ఫీడర్ కాలువలు, చెక్ డ్యామ్ లు, గ్రామాలలో బోరు బావుల వద్ద వృధా గా పోయే నీటిని భూమిలోకి



ఇంకే విధంగా రీఛార్జ్ పిట్ లతో పాటు రైతుల భూములలో డ్రిప్ ఇరిగేషన్, అటవి భూములలో కందకాలు, చిన్న ఊట కుంటలు మొదలైన నీటి సంరక్షణ పనులను చేయడం జరిగిందని ఈ నీటి సంరక్షణ పనుల వలన జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయని ఇట్టి అవార్డుతో పాటు జిల్లా కు రూ.కోటి రూపాయల నగదు కూడా దక్కిం దని అన్నారు. అవార్డు రావడానికి కృషిచేసిన అధికారులకు, సహ కారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి రామిరెడ్డి ఉన్నారు. వరంగల్ జిల్లాకు జల సంచాయ్– జన భాగీదారి అవార్డు లభించడంపై అదనపు కలెక్టర్ సంధ్యారాణి కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు జిల్లాకు ప్రతిష్టాత్మకమైన అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తు న్నారు.

## పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ
# ఎస్ హెచ్ జీకి అప్పగింత

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



పార్కులు పట్టణ ప్రకృతి వనాల నిర్వహణను ఎంపిక చేసిన ఎస్ హెచ్ జీ బృందాలకు అప్పగించనున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో హార్టికల్చర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశం లో పాల్గొని సమర్ధవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మీడియన్లు జంక్షన్ ల నిర్వహణతో పాటు మడికొండ నుండి సెంట్రల్ లైటింగ్ లో చెట్లు పెరిగి చీకటిగా ఉందని డి ఆర్ ఎఫ్ వారి సమన్వయం తో కొమ్మలను ట్రిమ్మింగ్ చేయాలని వచ్చే సంవత్సరం ప్లాంటింగ్ కోసం నర్సరీ లలో పెంచడానికి నగర అవసరాలు లక్ష్యం ఎంత ఉంది అని మేయర్ అధికారులను అడిగి తెలుసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అమృత్ మిత్ర 2.0 కార్యక్రమంలో భాగం గా హార్టికల్చర్ మెప్మా విభాగాలు సమన్వయం చేసుకొని స్వయం సహాయక బృందాలకు (ఎస్ హెచ్ జీ) పార్కులు, పట్టణ ప్రకృతి వనాలు నిర్వహణను 3 గ్రూప్ లను గుర్తించి వారికి అప్పగించాలని మేయర్ సి హెచ్ ఓ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సి హెచ్ఓ రమేష్, హెచ్ ఓ లక్ష్మారెడ్డి, హార్టుకల్చర్ అసిస్టెన్స్ ప్రిన్సి అశ్విని, అనుహ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయి నిర్మాణంపై బీజేపీ దృష్టి



**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ బీజేపీ ప్రధాన కార్యదర్శులు, మోర్చా అధ్యక్షులతో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కీలక సమీక్షా సమావేశానికి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వం వహించారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, బూత్ స్థాయి ఆధారాన్ని విస్తరించే అంశాలపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. సమావేశం అనంతరం రాంచందర్ రావు మాట్లాడుతూ టీఎస్ బీజేపీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలపర్చే దిశగా అన్ని విభాగాలూ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ ప్రణాళికలను సవరించుకోవాలని, బూత్ కమిటీలను శక్తివంతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. విభిన్న మోర్చాలు చేపట్టే కార్యక్రమాలు, యువత మహిళల భాగస్వామ్యం, సోషల్ మీడియా వ్యూహాలు, తదుపరి నెలల్లో అమలు చేసే ప్రత్యేక ప్రచార ప్రణాళికలపై నేతలు సమగ్ర చర్చ జరిపారు. ప్రతి నేత, ప్రతి కార్యకర్త ఒకే దిశగా కటుబాటుతో పనిచేస్తున్నారని రాంచందర్ రావు పేర్కొన్నారు. "బలమైన తెలంగాణ బీజేపీ బలమైన భారత్" సూత్రంతో పార్టీ ముందుకు సాగుతుందని, వచ్చే రోజుల్లో ప్రజల్లో మరింత చేరువయ్యే కార్యక్రమాలు చేపట్టనున్నట్టు రాంచందర్ రావు వెల్లడించారు.

# డ్రగ్స్ పై పోలీసులు ఉక్కపాదం మోపాలి




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ నగరంలో యువత విచ్చలవిడిగా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని వరంగల్ ఏసీపీకి బీజేపీ నాయకులు మెమోరండం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్ మాట్లాడుతూ గంజాయి మత్తులో ఎంజాయ్ చేయొద్దు, జీవితాన్ని నరకం చేసుకోవొద్దు" అని యువతకు హితవు పలికారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలి. తల్లిదండ్రుల శ్రమను వృథా చేయకూడదని, ఉన్నత విద్య సాధించి జీవితంలో ఎదగాలి" అని పిలుపునిచ్చారు. గంజాయి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులకు ఇదే సమయంలో మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని, వీటి వినియోగం వలన విద్యార్థులు తమ జీవితాలను అంధకారం చేసుకోవడంతో పాటు, ఆరోగ్య, ఆర్థికపరంగా చాలా నష్టపోతారని, ముఖ్యంగా మీ కోసం జీవించే తల్లిదండ్రుల సంతోషాన్ని దూరం చేస్తారని, యువత గంజాయికి బానిసై, మత్తులో కుటుంబ సభ్యులను కూడా గుర్తించ లేనంతగా ప్రవర్తిస్తున్నారు. త్వరగా డబ్బు సంపాదించాలనే దురాశతో యువత తప్పుడు మార్గాన్ని ఎంచుకొని, క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడుతు న్నారని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఏసీపీ స్పందించి త్వరితగత చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ శాసనసభ్యులు మార్తనేని ధర్మారావు, మాజీ మేయర్ డా. టి. రాజేశ్వర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో పర్మిషన్స్

లక్ష్యాలకు తమ వంతుగా భాగస్వామ్యం కావడానికి తెలంగాణ ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతోందని చెప్పారు.

**– కేంద్రం సహకరించాలి**

"దేశం ప్రగతిలో మెట్రోపాలిటన్ నగరాలు ఎన్నో రకాలుగా తోడ్పాటునందిస్తున్నాయి. దేశంలో వ్యవసాయ రంగంతో పాటు పట్టణీకరణ కూడా చాలా ముఖ్యమైన అంశం. ప్రత్యేకించి మెట్రోపాలిటన్ సిటీల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన పాలసీని తీసుకురావాలన్నారు. బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఎదగడంలో 10 శాతం మేరకు తెలంగాణ నుంచి దోహదపడాలని నిర్దేశించాం. ఆ లక్ష్యాల సాధన కోసం తెలంగాణ రైజింగ్ 2047 బృహత్ ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. డిసెంబర్ 9 వ తేదీన ఆ విజన్ డాక్యుమెంట్ ను ప్రజలకు అంకితం చేయబోతున్నామని తెలిపారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలని నిర్దేశించుకున్నామన్నారు. ఆ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రం తలపెట్టిన ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు మంజూరు చేస్తే మరింత వేగంగా ముందుకు వెళ్లగలమని చెప్పారు. హైదరాబాద్ నగరానికి ప్రత్యేకత ఉంది. మిశ్రమ సంస్కృతి, మంచి వాతావరణం కలిగి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ హైదరాబాద్ ను రెండో రాజధాని చేయాలన్నారు. ఇప్పుడా ప్రస్తావన విషయానికి వెళ్లను కానీ, అభివృద్ధి విషయంలో తెలంగాణకు కేంద్రం సహకారం, మద్దతు ఉండాలని కోరారు. ప్రధానంగా మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, నగరానికి గోదావరి జలాల తరలింపు, కాలుష్య నివారణలో భాగంగా ప్రస్తుతం నగరంలో డీజిల్ తో నడుస్తున్న 3 వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, సివరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లు వంటి అనేక ప్రాజెక్టులు చేపట్టాం. దేశంలో ఏర్పడిన జీసీసీల్లో 70 శాతం హైదరాబాద్ లో నెలకొల్పాయి. జీసీసీలు, డేటా సెంటర్లు, ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ నగరం ఒక హబ్ గా మారింది. వీటికి అనుగుణంగా ఇప్పుడు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. హైదరాబాద్ ను న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ లాంటి నగరాలతో పోటీ పడాలని భావిస్తున్నామన్నారు. పెట్టుబడుల కోసం చైనా ప్లస్ 1 గమ్యస్థానాల కోసం దేశాలు అన్వేషిస్తున్న దశలో మెట్రోపాలిటన్ నగరాల్లో ఎయిర్ పోర్టులు, విద్యుత్, నీటి వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. కేంద్ర మంత్రి కట్టర్ కి ముఖ్యమంత్రి గా చేసిన అనుభవం ఉంది. ముఖ్యమంత్రులకు ఎలాంటి కష్టాలుంటాయో వారికి ప్రత్యేకంగా తెలుసు. అందుకని రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది. దేశ ప్రధానమంత్రి రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బడా భాయ్ లాంటి వారే. మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, తాగునీటి సమస్య, కాలుష్య నియంత్రణ వంటి అనేక విషయాలపై దృష్టిని సారించి రాష్ట్రానికి సహకరించాలి" అని కోరారు.

**– సెంట్రల్ మినిస్టర్‌కు సీఎం అభినందన**

"రాజకీయాలు చేయాల్సిన సమయంలో రాజకీయాలు మాట్లాడొచ్చు. రాజకీయాలు ఇప్పుడు అసందర్భం. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ప్రభుత్వాలు వేరైనప్పటికీ విధానాలను అమలు చేయడంలో మార్పులేదు. కాకపోతే వాటిని మరింత పదును పెట్టి అమలు చేయడం జరిగింది." అని ముఖ్యమంత్రి చెప్పారు. పట్టణాభివృద్ధి విషయంలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న అంశంపై పలు రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖల సమావేశం హైదరాబాద్ లో ఏర్పాటు చేసినందుకు కేంద్ర మంత్రి కట్టర్ కి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి ఖట్టర్ సానుకూలంగా స్పందించారు.

# ఆవాసంలో చక్కటి విద్యాబోధన

- విశాలమైన క్రీడాప్రాంగణంలో విద్యార్థులకు ఆటలు
- క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందేలా టీచర్ల పాఠాలు






**వేద న్యూస్, జమ్మికుంట:**

పోటీతత్వం విపరీతంగా పెరిగిన ప్రస్తుత తరుణంలో విద్యా వ్యవస్థలో.. మార్కెట్ మాయాజాలంతో 'మార్కులు' కీలకంగా మారాయి. "ఒకటి..ఒకటి..ఒకటి..రెండు..రెండు..రెండు.." అంటూ ప్రకటనలతో విద్యార్థులను తమ వైపునకు తిప్పుకునేలా కొన్ని విద్యా సంస్థలు ప్రయత్నాలు ముమ్మురం చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ఆ ధోరణికి కొంత భిన్నంగా.. సమాజంలో నైతికత పెంపొందేలా..'నేటి బాలలే రేపటి పౌరులు' అనే విషయం గుర్తిస్తూ.. విలువలకు ప్రాధాన్యతనిస్తూ ..భారతీయత..సంస్కృతి సంప్రదాయాలు, దేశభక్తి..,ఆటలు, ధర్మం వంటి విషయాలను విద్యార్థులకు 'ఆవాసం'లో బోధిస్తున్నారు. జమ్మికుంట పట్టణంలోని కేశవపురం శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఆంగ్ల మాధ్యమంలో టీచర్లు చక్కటి విద్యను విద్యార్థులకు అందిస్తున్నారు.

**సువిశాలమైన చక్కటి క్రీడా ప్రాంగణం**

కొన్ని పాఠశాలలకు అయితే కనీసంగా చిన్న మైదానం కూడా లేని పరిస్థితుల్లో సువిశాలమైన క్రీడా ప్రాంగణంలో సుమారు 23 ఎకరాల్లో శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం కొనసాగుతుండటం విశేషం. ఆంగ్ల మాధ్యమంలో స్టూడెంట్స్‌కు అర్థమయ్యేలా పాఠాలను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. బాల, బాలికలు మొత్తం పాఠశాలలో ప్రస్తుతం 532 మంది ఉండగా, పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది 70 మంది ఉన్నారు. బాలికలు 149 మంది, 383 మంది బాలురు ఉన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలగా కొనసాగుతున్న ఈ విద్యాలయంలో 28 మంది ఆచార్యులు, ప్రధానాచార్యులు 24/7 అందుబాటులో ఉంటారు. క్రీడలకూ తగు ప్రాధాన్యతను ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పాఠశాల నుంచి 'ఖేల్‌కూద్'తో పాటు ఇతర పోటీలలో పాల్గొన్న విద్యార్థులు సుమారు 250 మందికిపైనే ఉన్నారు. భారతీయ సంప్రదాయాలతో పాటు పండుగల విశిష్టతలను వివరిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యంగా ఉండేలా ఉదయం వేళలో సూర్యనమస్కారాలు, యోగ, ఎక్సర్‌సైజెస్ చేయిస్తున్నారు. ఆధునిక సైన్స్‌ను ల్యాబరేటరీలలో ఆచరణాత్మకంగా బోధిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్టడీ హవర్స్‌కు సమయం కేటాయించేలా..కార్యాచరణ ఉంటుంది. టీచర్లు..డిజిటల్ క్లాసెస్‌నూ చెబుతూ..విద్యార్థులకు విజ్యువలైజేషన్ పరంగా సబ్జెక్టుపైన అవగాహన కలిగేలా దృష్టి సారిస్తున్నారు. 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు 'ఆవాసం'లో అందుతున్న విద్య పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విద్యతో పాటు విలువలను స్టూడెంట్స్‌లో పెంపొందించే చక్కటి పాఠశాల 'ఆవాసం' అని పలువురు పేర్కొన్నారు.

# మానవత్వం చాటి చూపిన ఆర్టీసీ డ్రైవర్

- సూర్యాపేటలో చిన్నారిని ప్రేమగా చూసుకున్న డ్రైవర్‌కు ప్రశంసలు
- సేవ మాత్రమే కాదు.. మనసున్న మనుషులు కూడా ఆర్టీసీ బలం
- మంత్రి పొన్నం ప్రభాకర్



**వేద న్యూస్, హైదరాబాద్ :**

విధి నిర్వర్తనలోనే కాదు, మానవత్వంలోనూ ఆదర్శంగా నిలిచే ఆర్టీసీ సిబ్బందిలో మరో ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట బస్టాండ్ వద్ద తన చిన్నారితో ప్రయాణిస్తున్న మహిళ వ్యక్తిగత అవసరాల కోసం బస్సు దిగగా, ఆ శిశువును చూసేందుకు ఎవరూ లేకపోయారు. ఈ పరిస్థితిని గమనించిన మనుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్, ఆ చిన్నారిని ప్రేమగా చూసుకుంటూ, జాగ్రత్తగా దగ్గర పెట్టుకుని తన మానవీయతను చాటుకున్నారు. శిశువును సురక్షితంగా కాపాడుతూ, తల్లి తిరిగి వచ్చే వరకు దాని పట్ల ఆప్యాయత చూపిన ఈ డ్రైవర్ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. తిరిగి వచ్చిన తల్లికి ఆ చిన్నారిని సంపూర్ణంగా సురక్షితంగా అప్పగించిన ఈ సంఘటన ప్రజలను అట్టడుగునుంచి హత్తుకుంటోంది. ఈ సంఘటనపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ డ్రైవర్ సేవా భావాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. "ఆర్టీ సీ అంటే కేవలం ప్రయాణ సేవ మాత్రమే కాదు మనసున్న మనుషుల తోటి సురక్షిత ప్రయాణం కూడా" అని ఆయన అన్నారు. డ్రైవర్ చేసిన ఈ మానవీయ చేష్ట ఆర్టీసీ ప్రతిష్ఠకు మరింత మెరుగులు దిద్దిందని ప్రశంసించారు. ప్రజలు, ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది అందరూ ఈ ఘటనను హృదయపూర్వకంగా స్మరిస్తూ, ఇటువంటి మానవీయ సేవలు సమాజంలో ఇంకా ఉన్నాయని గర్వంగా పేర్కొంటున్నారు.

# కోటి మంది మహిళలకు సిరిసిల్ల చీరలు..!

ళకు ఇందిరమ్మ చీరను అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టంగా సూచించారు. మహిళలకు నాణ్యమైన వస్త్రాలను అందించడం ద్వారా వారికి గౌరవాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేయాల్సిన ఈ చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి, వారికి ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, చీరల ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో, ఉత్పత్తికి అనుగుణంగా చీరల పంపిణీని రెండు దశల్లో చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ విధంగా పంపిణీ చేయడం ద్వారా సిరిసిల్ల కార్మికులకు పూర్తిస్థాయిలో పని కల్పించినట్లవుతుందని, లబ్ధిదారులకు కూడా నిరంతరాయంగా చీరలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పంపిణీ యొక్క తొలి దశలో, ఇందిరా గాంధీ జయంతి రోజు నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ రెండు ముఖ్యమైన తేదీలను ఎంచుకోవడం ద్వారా పథకానికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం యోచిస్తోంది. నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా పంపిణీని పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. చీరల పంపిణీలో నాణ్యత విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా, సాంకేతికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని, ఎక్కడా అవకతవకలు జరగడానికి వీలు లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# హిందుత్వంపై గర్వంగా మాట్లాడతా


ధర్మం మన నాగరికతకు మూలస్తంభమని, దానిపై గర్వంతో మాట్లాడటంలో ఎలాంటి సంకోచం లేదని ఆయన పేర్కొన్నారు. సనాతన విలువలను కాపాడటానికి తాను ఎలాంటి ఒత్తిడికీ, విమర్శకులకీ వెనక్కి తగ్గబోనని బండి సంజయ్ తెలిపారు. "మన పెద్ద బలం మన సంస్కృతి మన సనాతన ధర్మం. దీనిపై నేను గర్వంగా మాట్లాడుతాను. ఎవరైనా ప్రశ్నించినా, ఒత్తిడి తీసుకురావాలనుకున్నాదానిని తగ్గించను" అని వ్యాఖ్యానించారు. పహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్రదాడులను గుర్తుచేసిన బండి సంజయ్, ఈ ఘటనలు మన నాగరికతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని అన్నారు. పొరుగు దేశాల్లో జరుగుతున్న పరిస్థితులను చూస్తే నాగరికత విలువలను రక్షించాల్సిన బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. ప్రతి హిందువు సనాతన ధర్మంపై గర్వంగా నిలబడాలని, మన సంస్కృతిని కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండకూడదని బండి సంజయ్ పిలుపునిచ్చారు. మన మూలాలను రక్షించుకోవడం దేశ భవిష్యత్తు కోసం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. బండి సంజయ్ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

వేద న్యూస్

బుధవారం నవంబర్ 19, 2025

# అటవీ భూముల ఆక్రమణపై ఖండన

**– బుధవారం, 8 ఎన్జీవోల సంయుక్త ప్రెస్‌మీట్**




**వేద న్యూస్, నాగర్ కర్నూల్:**

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో అటవీ భూములను ఆక్రమించి, అక్రమంగా చెట్ల నరికివేతలు జరుగుతున్నాయని, దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించామని, 8 పర్యావరణ పరిరక్షణ ఎన్జీఓలు తెలిపాయి. వారు సంయుక్త వేదికగా ఫారెస్ట్ భూముల ఆక్రమణను తీవ్రంగా ఖండిస్తూ, పత్రికా సమావేశం బుధవారం ఏర్పాటు చేసినట్టు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్ మండలంలోని మల్లేశ్వరం గ్రామం, ములచింతలపల్లి గ్రామం, మరియు జిల్లావాయిపల్లి గ్రామం/వాయిలపాడుకుల గ్రామం పరిసర ప్రాంతాలలో అటవీ సంరక్షణ హక్కులు ( రెసిడెన్షియల్ ఆక్యుపెన్సీ ఇన్ ఫారెస్ట్ రైట్స్) పేరుతో అటవీ భూమి ఆక్రమణలు, అక్రమ చెట్ల నరికివేతలు, ఆర్వో ఎఫ్ఆర్లో అవకతవకలు, అటవీ సిబ్బందిపై దాడులు మరియు బెదిరింపులు జరుగుతున్నట్లు ఎన్జీఓలు గట్టి ఆధారాలను సేకరించాయి. ఈ ఆక్రమణల వెనుక కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని, వారు డబ్బు కోసం అడవిని పాడు చేస్తున్నారని, అడవిని 'కులం' పేరుతో విభజించి అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారని, అక్రమ మైనింగ్ కార్యకలాపాలను ప్రోత్స హిస్తున్నారని ఎన్జీఓలు ఆరోపించాయి. పర్యావరణానికి జరుగుతున్న ఈ విధ్వంసాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంపై పూర్తి వివరాలు తెలుపనున్నట్టు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం (ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్) కొల్లాపూర్ లో ప్రెస్ మీట్ ఉంటుందని స్పష్టం చేశారు. 8 ఎన్జీఓల సంయుక్త వేదికలో ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ , ఇండియన్ సొసైటీ ఫర్ సస్టైనబుల్ ఎన్విరాన్‌మెంట్ అండ్ వైల్డ్ లైఫ్ , నేచర్ ఫ్రెండ్స్ ఎన్విరాన్‌మెంటల్ డెవలప్ మెంట్ సొసైటీ , ప్రకృతి పర్యావరణ సంరక్షణ సమితి, కుంధి/గ్లోబల్ బయోడైవర్సిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్, సుందర్‌లాల్ బహుగుణ పర్యావరణ పరిరక్షణ సొసైటీ, ఎన్విరాన్‌మెంట్ వైల్డ్ లైఫ్ కన్సర్వేషన్ సొసైటీ లు ఉన్నాయి. పూర్తి వివరాలకు రమేష్ జెట్టిని 95020 01450 నంబర్‌లో సంప్రదించొచ్చు.

# పైరసీతో డేటా చోరీ..!

**– ఉచితం కోసం వెళ్లి నష్టపోవద్దు**

**– తెలంగాణ పోలీసుల కీలక హెచ్చరికలు**

**వేద న్యూస్, హైదరాబాద్ :**

పైరసీ వెబ్‌సైట్‌లు, ఉచితంగా కంటెంట్‌ను అందించే అనధికారిక ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించడం ద్వారా వినియోగదారులు తమ ముఖ్యమైన మరియు వ్యక్తిగత డేటాను కోల్పోయే ప్రమాదం ఉందని తెలంగాణ పోలీసులు ప్రజలను తీవ్రంగా హెచ్చరించారు. పైరసీని ఏ విధంగానూ ప్రోత్సహించవద్దని, ఉచితం కదా అని అలాంటి లింక్‌లు లేదా అప్లికేషన్ల జోలికి వెళ్లవద్దని సూచించారు. మీ అమూల్యమైన డేటాను సైబర్ మోసగాళ్ల చేతిలో పెట్టవద్దని, పైరసీ వెబ్‌సైట్‌లను సందర్శించడం ద్వారా మీ భద్రతకు మీరే ముప్పు తెచ్చుకుంటున్నారని పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ పోలీసులు ఒక పబ్లిక్ సర్వీస్ ప్రకటనను విడుదల చేశారు. పైరసీ వెబ్‌సైట్‌లను లేదా అప్లికేషన్లను ఉపయోగించే వారికి తెలియకుండానే వారి కంప్యూటర్లు లేదా స్మార్ట్‌ఫోన్లలోకి మాల్‌వేర్ అటాక్ జరిగి డేటా చోరీ అవుతుందని పోలీసులు తెలిపారు. ఈ మాల్‌వేర్ మీ పరికరంలోకి ప్రవేశించిన తర్వాత, మీకు తెలియకుండానే అది మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు లేదా ఇతర సున్నితమైన డేటాను సైబర్ నేరగాళ్లకు చేరవేసే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఉచిత కంటెంట్ కోసం ప్రయత్నించడం చివరికి భారీ నష్టాన్ని కలిగించే ప్రమాదముందని పోలీసులు వివరించారు. పైరసీ కారణంగా కేవలం ఆర్థిక లేదా వ్యక్తిగత డేటా చోరీ మాత్రమే కాకుండా, మీ ఫోన్లలోని లేదా కంప్యూటర్లలోని వ్యక్తిగత ఫోటోలు మరియు ఫైల్స్ కూడా లీక్ అయ్యే ప్రమాదం ఉందని తెలంగాణ పోలీసులు పౌరులను అప్రమత్తం చేశారు. పైరసీ సైట్‌లలో క్లిక్ చేసే ప్రతి లింక్, డౌన్‌లోడ్ చేసే ప్రతి ఫైల్ వెనుక మాల్‌వేర్ లేదా స్పైవేర్ దాగి ఉండవచ్చు. ఉచితంగా సినిమానో లేదా పాటనో చూసేందుకు వెళ్లి, చివరకు మీ వ్యక్తిగత గోప్యతను, భద్రతను కోల్పోవాల్సి వస్తుందని వారు నొక్కి చెప్పారు. పోలీసులు ముఖ్యంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఉచితం కోసం వెళ్లి మీ కష్టార్జితాన్ని లేదా మీ వ్యక్తిగత సమాచారాన్ని కోల్పోవద్దని తెలిపారు. పైరసీని అస్సలు ఎంకరేజ్ చేయవద్దని, చట్టబద్ధమైన మరియు అధికారిక ప్లాట్‌ఫారమ్‌ల ద్వారానే కంటెంట్‌ను వినియోగించాలని సూచించారు. పైరసీ వెబ్‌సైట్‌లు చాలా వరకు అక్రమ బెట్టింగ్ యాప్‌లు మరియు ఇతర నేరపూరిత వెంచర్లకు సంబంధించిన ప్రకటనలను కలిగి ఉంటాయని, వాటి ద్వారా కూడా వినియోగదారులు మోసపోయే ప్రమాదం ఉందని తెలిపారు. మొత్తంగా, తెలంగాణ పోలీసులు పైరసీ ద్వారా జరిగే డేటా చోరీ మరియు సైబర్ నేరాల పట్ల ప్రజలను చైతన్యపరచడానికి ఈ హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పైరసీని ప్రోత్సహించకుండా, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని కోరారు. ఏవైనా సైబర్ నేరాలు జరిగితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.




# మార్కెట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**– మార్కెట్ బైలాకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం.**



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ నగరంలోని లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లో జరుగుతున్న దోపిడీని అరికట్టి రైతుల పంటలకు సరైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి మార్కెట్ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరు గాలం కష్టపడి పండించిన కూరగాయల పంటలను మార్కెట్‌కు తీసుకొస్తే, వ్యాపారులు మార్కెట్ బైలాకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వ్యాపారులే సొంత ఖర్చులకు ఏదో ఒక సందర్భంలో 'టెండర్' అనే విధానాన్ని వారికే వారే ప్రకటించుకుని, ఆ రోజు రైతులు తెచ్చిన పంటలను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, దీని వలన మార్కెట్‌కు వచ్చే ఆదాయంతో పాటు, రైతులకు వచ్చే ఆదాయాన్ని కూడా కొల్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 లోనే తమ సంఘం ఉన్నత అధికారులకు తెలియ జేయగా, ఈ టెండర్ విధానాన్ని రద్దు చేయడం జరిగిందనీ. అయిన ప్పటికీ, ఈ మధ్యకాలంలో మళ్లీ వ్యాపారస్తులు కూరగాయల మార్కెట్ లో 'టెండర్' అనే విధంగా వారికి వారే ప్రకటించుకుని, రైతుల కు తక్కువ ధర చెల్లిస్తూ వినియోగదారులకు ఎక్కువ ధరకు అమ్ము తున్నారని అదానపు కలెక్టర్ కు వివరించారు. నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్న మార్కెట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు స్వేచ్ఛగా తమ పంటను అమ్ముకునే విధంగా, మార్కెట్‌కు ఆదా యం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టెండర్ విధా నాన్ని పాటించిన వ్యాపారుల లైసెన్సులను రద్దు రద్దుచేసి టెండర్ లో వచ్చిన లక్షల రూపాయలను మార్కెట్ కార్యాలయానికి జమ చేయాలన్నారు. మార్కెట్‌లో రైతుల పంటను స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశాలు రైతులకు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు ఊరటి హంసల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బల్లు ఎల్లయ్య, రవీందర్ రాజు పాల్గొన్నారు.

# డిసెంబర్ 30 నుండి వైకుంఠ ద్వార దర్శనాలు

**– వైకుంఠ ఏకాదశికి సామాన్య భక్తులకు ప్రాధాన్యం**

**– 10 రోజుల దర్శనానికి టీటీడీ కీలక నిర్ణయాలు**



**వేద న్యూస్, తిరుపతి :**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి సందర్భంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ టీటీడీ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంది. డిసెంబర్ 30 నుండి 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. మొత్తం 182 గంటల దర్శన సమ యంలో ఏకంగా 164 గంటలు సామాన్య భక్తులకే కేటాయించారు. మొదటి మూడు రోజులు రూ. 300, శ్రీవాణి దర్శనాలను రద్దు చేశారు. జనవరి 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు రోజుకు 15 వేల రూ.300 దర్శన టిక్కెట్లు, 1000 శ్రీవాణి దర్శన టిక్కెట్లు రెగ్యులర్ పద్ధతిలో కేటాయిస్తారు. అయితే మొదటి మూడు రోజులకు మాత్రం ఈ–డిప్ ద్వారా టోకెన్ల కేటాయింపు ఉంటు ంది. దీని కోసం నవంబర్ 27 నుండి డిసెంబర్ 1వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిం చారు. డిసెంబర్ 2న డిప్ ద్వారా ఎంపికైన వారికి టోకెన్లు జారీ చేస్తా రు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను టీటీడీ వెబ్ సైట్, యాప్, వాట్సాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహిసారు. జనవరి 6, 7, 8 తేదీల్లో తిరుమల, తిరుపతి స్థానికులకు రోజుకు 5 వేల టోకెన్లు ఆన్ లైన్ లో ముందుగా బుక్ చేసుకున్న వారికి ముందు ప్రాతిపదికన కేటాయిస్తారు. పది రోజుల పాటు ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా మిగిలిన అన్ని రకాల ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు టీటీడీ ప్రకటించింది.

# 'దుర్గ' ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్

**– నేటి నుంచి అందుబాటులో..**




**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ ఎస్బీఐ లైన్‌లోని దుర్గ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్ అందుబాటులోకి రానున్నారు. ఈ మేరకు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పి.కిరణ్ గౌడ్ తెలిపారు. జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం కిమ్స్‌లో పని చేసిన ఆర్థోపెడిక్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ తరుణ్ సింగ్ 24/7 అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించనున్నారని వెల్లడించారు. ఎంబీబీఎస్ ఎంఎస్ ఆర్థో, ఎఫ్ఐజేఆర్, ఎఫ్ఐటి(కిమ్స్ ఆస్పత్రి), జాయింట్ రీప్లేస్‌మెంట్ స్పైన్ స్పోర్ట్స్ ఇంజూరీస్, పెయిన్ మేనేజ్‌మెంట్, రోబోటిక్ సర్జన్‌గా పేరు గాంచిన డాక్టర్ తరుణ్ సేవలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆర్థో సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, జమ్మికుంట పట్టణంలోని దుర్గ ఆస్పత్రిని సంప్రదిస్తే చాలని, వైద్య సేవలు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

# నేటి నుంచి ప్రపంచ వారసత్వ వారోత్సవాలు

**– మొదటి రోజు ఖిలావరంగల్ లో ఉచిత ప్రవేశం**



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ఈనెల 25 వరకు ప్రపంచ వారసత్వ వారోత్సవాలు జరగనున్నాయి. చరిత్ర, వారసత్వ సంపదపై ప్రజల్లో అవగాహన పెంచడానికి కేంద్ర పురావస్తు వరంగల్ జిల్లాలోని చారిత్రక పర్యాటక కేంద్రమైన ఖిలా వరంగల్ కోటలో మొదటి రోజు (బుధవారం) ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. సాధారణంగా రుసుము చెల్లించి సందర్శించే చారిత్రక కట్టడాలను ఉచితంగా చూసే అవకాశాన్ని పర్యా టకులకు కల్పించింది. ఈ అవకా శాన్ని దూర తీరాల నుంచి వచ్చే పర్యా టకులు, స్థానికులు సద్వినియోగం చేసు కోవాలని కేంద్ర పురావస్తు శాఖ విజ్ఞప్తి చేసింది.

# ఇద్దరు పిల్లలతో మహిళ ఆత్మహత్య




**వేద న్యూస్, హైదరాబాద్:**

ప్రియుడు వదిలేసి వెళ్లాడని ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి జిల్లాలోని అరుమనై సమీపంలోని పున్నియం ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పున్నియం ఏరియాకు చెందిన బిందు (34) కు 15 ఏళ్ల క్రితం జయకుమార్‌తో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. అనారోగ్యంతో జయకుమార్ మరణించడంతో ఆమె కొన్ని నెలల క్రితం మరుదంపారై ప్రాంతానికి చెందిన వివన్‌ను రెండో వివాహం చేసుకుంది.ఆమెకు వివన్‌తో ఓ కుమార్తె ఉంది. ఈ స్థితిలో అభిప్రాయ భేదాల కారణంగా రెండో భర్త కూడా విడిపోయారు. తరువాత ఆమె తన కొడుకు, కూతురితో కలిసి పున్నియం ప్రాంతంలోని తన తల్లి ఇంటికి వెళ్లింది. అక్కడ బిందుకి పక్కింట్లో నివసించే విజితో వివాహేతర సంబంధం ఏర్పడింది. విజికి భార్య, కాలేజీ చదువుతున్న కొడుకు, కూతురు ఉన్నారు. ఈ విషయం గురించి విజి భార్యకు తెలియడంతో అభ్యంతరం చెప్పింది.దాంతో విజి రెండు నెలల క్రితం బిందు, ఆమె ఇద్దరు పిల్లల (5వ తరగతి చదువుతున్న కొడుకు, ఎల్‌కేజీ చదువుతున్న కూతురు) తో కలిసి బిలాంగ్‌తోట్టవిలైకి వెళ్లి ఆర్‌సీ చర్చిరోడ్డులో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. దాంతో విజి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

# భర్త మృతిపై అనుమానం..!

- పోలీస్ స్టేషన్‌లో మృతుడి రెండో భార్య ఫిర్యాదు
- కేసు దర్యాప్తు.. మృతదేహానికి పోస్టు మార్టం



**వేద న్యూస్, రుద్రూర్:**

తన భర్త మృతిపై అనుమానాలున్నాయని మృతుడి రెండో భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారం భించారు. ఈ క్రమంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకెళితే..రుద్రూర్ మండల కేంద్రం లోని ఆర్ఎస్సీ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మేతరి సాయిలు.. రెండు నెలల నుండి అనారోగ్యంతో బాధపడుతూ పది రోజుల క్రితం మృతి చెందారు. ఎస్సై సాయన్న కథనం ప్రకారం..మృతుడు మేతరి సాయిలు మొదటి భార్య శోభ మరణించగా, కోటగిరి గ్రామానికి చెందిన బొర్ర సాయవ్వతో సాయిలుకు వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు కలదు. అయితే, ఇటీవల తన భర్త సాయిలు మృతి చెందగా తనకు సమాచారం ఇవ్వలేదని సాయవ్వ తెలిపారు. అంత్యక్రియలు చేసిన విషయం తనకు తెలియదని, సాయిలు మృతిపై గైని పెద్ద సాయిలు, గైని శివలీల, గైని పోచమ్మల పై అనుమానం ఉందని, బొర్ర సాయవ్వ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మంగళవారం మృతుడు సాయిలు మృత దేహాన్ని పూడిక తీయించి తహశీల్దార్ తారాబాయి, డాక్టర్ల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి, నిజామాబాద్ ఫోరెన్సిక్ వారికి పంపామని ఎస్సై సాయన్న వెల్లడించారు.

# ఐ-బొమ్మ రవి కేసులో ఈడీ ఎంట్రీ..!

- మనీలాండరింగ్ కోణంలో లోతైన విచారణకు రంగం సిద్ధం
- బెట్టింగ్ యాప్స్ ద్వారా నిధుల సమీకరణ
- క్రిప్టో వాలెట్ల నుంచి విదేశీ లావాదేవీలు
- నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లు ఫ్రీజ్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐ-బొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగడం పెద్ద మలుపుగా మారింది. ఈ కేసులో భారీ స్థాయిలో ఆర్థిక అవకతవకలు మరియు మనీలాండరింగ్ (డబ్బు అక్రమ తరలింపు) జరిగినట్లు ఈడీ అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ అనుమానాల నేపథ్యంలో, ఈ కేసును లోతుగా దర్యాప్తు చేసేందుకు ఈడీ సమాయత్తమవుతోంది. పైరసీ వెనుక జరిగిన ఆర్థిక లావాదేవీలు, బెట్టింగ్ యాప్‌ల ద్వారా నిధుల సమీకరణ వంటి అంశాలపై ఇప్పుడు ఈడీ దృష్టి కేంద్రీ కృతం కానుంది. ఈ కేసుకు సంబంధి ంచిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, మరియు దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు అధికారికంగా లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నా రు. ఈడీ దర్యాప్తుతో నింది తుడు ఇమ్మడి రవికి విదేశీ నిధుల ప్రవాహం, అక్రమ హవాలా లావాదేవీలతో సంబంధం ఉందా అనే కోణంలో లోతుగా పరిశోధన జరగనుంది. ఐ-బొమ్మ వెబ్‌సైట్ నిర్వహణ ద్వారా ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల రూపంలో భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో స్పష్టమైంది. అంతేకాకుండా, ఈ నిధుల మూలాలను మరింత లోతుగా పరిశోధించగా, ఒక క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా సుమారు రూ.15 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రిప్టో, ఎన్నారై ఖాతాల లావాదేవీలు విదేశీ నిధుల ప్రవాహానికి మరియు అక్రమ నగదు బదిలీకి సూచనగా ఉండటంతో, ఈడీ దీనిపై తీవ్రంగా దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు చట్టపరమైన ప్రక్రియల ద్వారా నిందితుడు ఇమ్మడి రవికి చెందిన వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేశారు. ఈ మొత్తం నిధులు అక్రమ మార్గాల ద్వారా వచ్చినవిగా పోలీసులు భావిస్తున్నారు. ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగడం వలన, నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, ఆ నిధుల మూలాలు, వాటి మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది. చట్ట విరుద్ధ కార్యకలాపాల ద్వారా ఆర్జించిన ఆస్తులను జప్తు చేసే అధికారం ఈడీకి ఉండటం వలన, ఈ కేసు మరింత కీలకంగా మారనుంది. మొత్తం మీద, కేవలం పైరసీ కేసుగానే కాకుండా, ఇదొక అంతర్జాతీయ ఆర్థిక నేరాల కోణంలోకి మారే అవకాశం కనిపిస్తోంది. ఐ-బొమ్మ వెనుక ఉన్న భారీ ఆర్థిక వ్యవస్థ, హవాలా, క్రిప్టో లావాదేవీలు వంటి అంశాలపై ఈడీ దర్యాప్తు కేంద్రంగా ఉంటుంది. ఈ దర్యా ప్తు సినీ పరిశ్రమలో పైరసీకి అడ్డుకట్ట వేయ డమే కాకుండా, అక్రమ ఆస్తుల నిర్మూల నలోనూ ముఖ్య పాత్ర పోషించనుంది. ఈడీ విచారణ తర్వాత నిందితులపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# డిజిటల్ ఎడ్యుకేషన్‌లో పెద్ద అడుగు

- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి
- కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్‌తో ఒప్పందం
- ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ స్థాపన - సీఎం రేవంత్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో డిజిటల్ విద్యకు నూతన దిశలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడుగు వేసింది. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ స్థాపనకు సిద్ధమవుతోంది. ఈ ఒప్పందం ద్వారా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిజిటల్ విద్యా రంగంలో ప్రముఖ స్థాయికి ఎదుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందం అమలులోకి వస్తే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిజిటల్ విద్య, ఆన్‌లైన్ లెర్నింగ్, నూతన బోధనా సాంకేతికతల్లో ముందంజలో నిలుస్తుందని చెప్పారు. "భవిష్యత్తులో ఈ యూనివర్సిటీని ఒక భారీ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తాం. ప్రపంచ స్థాయి డిజిటల్ విశ్వవిద్యాలయ స్థాయికి తీసుకెళ్తాం" అని సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు, సీఈఓ పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, వైస్‌చాన్స్‌లర్ ఘంటా చక్రపాణి, పలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో డిజిటల్ విద్యా వ్యవస్థను బలపరిచే దిశగా ఇది కీలకమైన అడుగుగా భావిస్తున్నారు.

# శాసన మండలి పునరుద్ధరణ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలన, కీలక సూచనలు

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం శాసన మండలి భవన పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించారు. చారిత్రాత్మక అసెంబ్లీ ప్రధాన భవనంలో ఉన్న పాత శాసన మండలిని పునరుద్ధరించాలని గతంలోనే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, ఈ మరమ్మతు పనులు ఏ విధంగా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. ముఖ్యమంత్రి ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లతో కలిసి భవనాన్ని కలియతిరిగారు. భవన పరిశీలన సమయంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ భవనం యొక్క నిర్మాణ శైలి మరియు గొప్పదనం చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులు జరుగుతున్న తీరును, వినియోగిస్తున్న వస్తువుల నాణ్యతను గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరియు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో పాటు అధికారులు భవనం యొక్క ప్రస్తుత స్థితి, చేపట్టాల్సిన పనుల వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర శాసన వ్యవహారాలలో కీలక పాత్ర పోషించే ఈ మండలి భవనాన్ని అత్యంత నాణ్యతతో, ఆధునిక సదుపాయాలతో పునరుద్ధరించాలని ఆయన ఆకాంక్షించారు. చారిత్రక భవనాలకు పూర్వవైభవం తీసుకు రావడంలో ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని ఈ పర్యటన తెలియ జేస్తోంది. ఈ మరమ్మతులు పూర్తయితే, శాసన మండలి సమా వేశాలు మరింత సులభంగా, సౌకర్యవంతంగా నిర్వహించడానికి అవకా శం లభిస్తుంది. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పునరుద్ధరణ పనుల వివరాలు, ఎదురవుతున్న సవాళ్లు మరియు భవిష్యత్తు ప్రణాళికలను సమ గ్రంగా ముఖ్య మంత్రి దృష్టికి తీసు కు వచ్చారు. చారి త్రక భవనం లో



మరమ్మతులు చేపట్టేటప్పుడు సాంప్రదాయ శైలిని కొనసాగించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరాన్ని అధికారులు ప్రస్తావించారు. భవిష్యత్తులో శాసనమండలి సమావేశాలు సజావుగా జరిగేందుకు వీలుగా అన్ని రకాల సాంకేతిక ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మొత్తంగా, ఈ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ ద్వారా రాష్ట్ర పరిపాలనా భవనాలకు ముఖ్యమంత్రి ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి మార్గదర్శకాలను అనుసరించి పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ చారిత్రక శాసన మండలి భవనం త్వరలోనే పునరుద్ధరణ పూర్తి చేసుకొని, రాష్ట్ర శాసనసభ యొక్క ఘనమైన చరిత్రను ప్రతిబింబిస్తూ పూర్వవైభవంతో కొత్త రూపం సంతరించుకోనుంది.

# ముంచుకొస్తున్న అల్పపీడనం

- రెండు రాష్ట్రాలకు వాతావరణ హెచ్చరిక
- ఏపీకి వాన గండం.. తెలంగాణలో చలి పంజా

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణ పరిస్థితి కొనసాగుతోంది. ఒక వైపు చలి తీవ్రత గజగజ వణికిస్తుంటే, మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో మంగళవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రకాశం, అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి, కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు, నవంబర్ 21వ తేదీన బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మరో నాలుగు రోజుల పాటు ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇప్పటికే మంగళవారం ఉదయం నుంచి తిరుమల, తిరుచానూరులో భారీ వర్షం కురుస్తుండటంతో



భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అల్ప పీడన వర్షాల కారణం గా ఏపీలో కొన్ని ప్రాంతాల్లో చలి మరియు వానల మిశ్ర మ వాతా వరణం నెల కొనే అవకాశం ఉంది. ఇక తెలంగాణ విషయానికొస్తే, రాష్ట్రంలో చలి పంజా విసురుతోంది. కనిష్ట ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో 7 డిగ్రీలకు పడిపోయింది. భారతదేశం అంతటా చలిగాలులు, వర్షపాతం హెచ్చరికలను జారీ చేసిన ఐఎండీ, నవంబర్ 18 నుంచి 20 తేదీల మధ్య పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, విదర్భలోని కొన్ని ప్రాంతాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.సంగారెడ్డి, కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్‌లలో 8 డిగ్రీలు, భూపాలపల్లిలో 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# గ్రూప్ -2 పరీక్ష రద్దు..



**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో పోటీపరీక్షలకు సిద్ధమై గ్రూప్స్ కొలువు కొట్టినవాళ్లకు భారీ షాకింగ్ న్యూస్. పదేళ్ల క్రితం నిర్వహించిన గ్రూప్ -2 పరీక్ష ను మంగళవారం హైకోర్టు రద్దు చేసింది. 2015-16 లో నిర్వహించిన గ్రూప్ -2 పరీక్షను రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. పిటిషనర్ల వాదనలు విన్న న్యాయమూర్తి నగేష్ భీమపాక పరీక్ష విషయంలో హైకోర్టు ఆదేశాలను తెలంగాణ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ ఉల్లంఘించిందని తెలిపారు. అంతేకాదు టీజీపీఎస్సీ తన పరిధి దాటి వ్యవహరించిందని పేర్కొన్న న్యాయమూర్తి.. పునర్‌మూల్యంకనం చేయాలని బోర్డును ఆదేశించారు. ఆ తర్వాతే అర్హుల జాబితా ప్రకటించాలని స్పష్టం చేశారు. 8 వారాల్లోగా పునర్‌మూల్యంకనం, జాబితా ప్రకటన ప్రక్రియ ముగించాలని టీజీపీఎస్సీకి జడ్జి సూచించారు

# ‘ఎక్స్’ డౌన్!

## - మళ్లీ మొరాయించిన క్లౌడ్‌ఫ్లేర్ సర్వర్!



**వేద న్యూస్, డెస్క్:**

ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ (ట్విట్టర్) మళ్లీ మొరాయిస్తున్నది. మంగళవారం సాయంత్రం 5గంటల భారత్‌లో ‘ఎక్స్’ పని చేయడం లేదు. డిజిటల్ ప్లాట్‌ఫాట్స్ ట్రాకర్ వెబ్‌సైట్ అయిన డౌన్ డెటెక్టర్‌లో వేలాది మంది వినియోగదారులు ఫిర్యాదు చేశారు. తమ అకౌంట్స్‌ని యాక్సెస్ చేయలేకపోతున్నామంటూ రిపోర్ట్ చేశారు. ‘ఎక్స్’ యాప్‌తో పాటు వెబ్‌సైట్‌లో లాగిన్ చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. పలువురు ఇంటర్నల్ సర్వర్ ఎర్రర్ సందేశం వస్తున్నట్లుగా తెలిపారు. భారత్‌తో పాటు అమెరికాలోనూ ‘ఎక్స్’ని యాక్సెస్ చేయలేకపోతున్నామంటూ యూజర్లు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చాలాచోట్ల ఎక్స్ పని చేయడం లేదని సమాచారం. అయితే, ఎక్స్ పని చేయకపోవడానికి క్లౌడ్‌ఫ్లేర్‌లోని సాంకేతిక సమస్య కారణంగా సమాచారం.అయితే, దీని పై ఇప్పటి వరకు ‘ఎక్స్’ ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. పలువురు యూజర్లు ఇతర సోషల్ మీడియా వేదికగా ఎక్స్‌తో పాటు పలువురు వెబ్‌సైట్స్ సైతం పని చేయడం లేదని పేర్కొన్నారు. క్లౌడ్‌ఫ్లేర్‌లోని హోస్ట్ సర్వర్ డౌన్ అయ్యిందని ఓ యూజర్ తెలిపాడు. అదే సమయంలో వేలాది మంది డౌన్ డిటెక్టర్‌లోనూ సమస్యలను ఎదుర్కొంటున్నట్లుగా తెలిపారు. ఈ సాంకేతిక లోపం ప్రపంచవ్యాప్తంగా భారీగా కనిపిస్తున్నది. ఎక్స్ మొబైల్ యాప్ నుంచి 61 శాతం మంది ఫిర్యాదు చేయగా.. వెబ్‌సైట్ పని చేయడం లేదని 28శాతం, సర్వర్ కనెక్షన్ లోపాలు తలెత్తినట్లుగా 11శాతంగా మంది ఫిర్యాదు చేసినట్లుగా డేటా పేర్కొంది. అయితే, దీనిపై క్లౌడ్‌ఫ్లేర్ స్పందించింది. క్లౌడ్‌ఫ్లేర్ సిస్టమ్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని.. సమస్యను గురించి వేగంగా పరిష్కరిస్తామని పేర్కొంది. అయితే, గత కొంతకాలంగా ఎక్స్ మొరాయిస్తూ వస్తున్నది. తరుచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతో యూజర్లు ఇబ్బంది పడుతున్నారు.

# సింహాద్రి దర్శనానికి బాలయ్య - బోయపాటి!




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ కథానాయకుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దర్శకుడు బోయపాటి శ్రీను కలిసి మంగళవారం ఉదయం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. వీరితో పాటు చిత్ర నిర్మాత గోపీ అచంట కూడా ఉండడం విశేషం. బోయపాటి శ్రీను, బాలకృష్ణ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం అఖండ 2, అఖండ చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ విజయవంతం కావాలని చిత్రబృందం సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకుంది. అంతకుముందు బాలయ్య కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకొని బేడా మండ´పం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజ ల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆయనను ఆశీర్వదించి స్వామి వారి ప్రసా దం అందించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలను చిత్రబృందం ఎక్స్ వేదికగా విడుదల చేసింది.

# కాగ్నిజెంట్‌లో ఉద్యోగులపై నిఘా!




**వేద న్యూస్ డెస్క్:**

ఉద్యోగుల పనితీరును అంచనా వేసేందుకు సాఫ్ట్‌వేర్ కంపెనీ కాగ్నిజెంట్ కఠినమైన విధానాన్ని తీసుకొస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఉద్యోగుల ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ మానిటర్ ఐదు నిమిషాలు ఆగినా.. ఎలాంటి యాక్టివిటీ లేకున్నా.. దానిని ‘ఐడిల్’గా మార్కింగ్ చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం గాను కంపెనీ ‘ప్రోహాన్స్’ అనే టూల్‌ను వినియోగించేందుకు సిద్ధమవుతుందట.కాగ్నిజెంట్ ఇప్పుడు ఉద్యోగుల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం ఈ పర్యవేక్షణ వ్యవస్థను తీసుకువచ్చింది.కంపెనీ జారీ చేసిన ల్యాప్‌టాప్‌లు, పీసీల ద్వారా ఉద్యోగుల పనితీరును ట్రాక్ చేస్తోంది. ఇందుకోసం ‘ప్రోహాన్స్’ వంటి వర్క్ ఫోర్స్ మేనేజ్‌మెంట్ సాధనాలను వినియోగిస్తోంది. ఉద్యోగులు ఉపయోగించే కీబోర్డు, మౌస్‌ల ద్వారా ట్రాక్ చేస్తోంది. ఈ తరహా ట్రాకింగ్‌పై విమర్శలు వస్తున్నాయి.5 నిమిషాల కంటే ఎక్కువసేపు ఉద్యోగి పని చేయకుండా ఖాళీగా ఉన్న సమయాన్ని ప్రోహాన్స్ వంటి టూల్ ట్రాక్ చేస్తుంది. మౌస్ లేదా కీబోర్డు 5 నిమిషాల కంటే ఎక్కువసేపు ఇన్-యాక్టివ్‌గా ఉంటే ఆ ఉద్యోగి ఖాళీగా ఉన్నట్లు పరిగణిస్తారు. అదే 15 నిమిషాల కంటే ఎక్కువసేపు ఇన్-యాక్టివ్‌గా ఉంటే వేరే పనిలో నిమగ్నమైనట్లు పరిగణిస్తారు.ఈ మానిటరింగ్ వ్యవస్థ ఒక్కో టీమ్‌కు ఒక్కో విధంగా ఉంటుందని కథనాలు వెలువడ్డాయి.ఈ ట్రాకింగ్ వ్యవస్థపై విమర్శలు వస్తుండటంతో కంపెనీ స్పందించింది. ఈ ట్రాకింగ్‌ను ఉద్యోగి పనితీరుకు ముడిపెట్టబోమని స్పష్టం చేసింది. ప్రమోషన్లు, బోనస్ వంటి అంశాల్లో ఈ డేటాను ఉపయోగించబోమని,వెల్లడించింది. ఉపయోగిస్తున్నట్లు తెలిపింది.

# తెలుగు పదాలతో పీసీ కుస్తీ..

## - భాష నేర్చుకుంటున్న ప్రియాంక చోప్రా..



**వేద న్యూస్, డెస్క్:**

సూపర్ స్టార్ మహేష్ బాబు- దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో పాన్ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ‘వారణాసి’ టైటిల్ అనౌన్స్‌మెంట్ హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్‌లో గ్రాండ్‌గా జరిగింది. మహేష్ ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌తో జక్కన్న ప్రపంచానికి కొత్త రూపాన్ని పరిచయం చేస్తే, బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా ఈవెంట్‌లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు. స్టేజ్‌పైకి వచ్చిన ప్రియాంక చోప్రా తెలుగులో “హలో హైదరాబాద్”, “తగలబెట్టేద్దామా?” అంటూ అభిమానులను పలకరించడంతో హాల్ అంతా హర్షధ్వనులతో మార్మోగింది. ఈ క్యూట్ తెలుగు డైలాగులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈవెంట్ కోసం ప్రత్యేకంగా తెలుగు ప్రాక్టీస్ చేసిన వీడియోను కూడా ఆమె షేర్ చేయగా, ఆ డెడికేషన్‌పై నెటిజన్లు ఫిదా అవుతున్నారు. “సినిమాలో కంటె లైవ్ స్టేజ్‌పై తెలుగు మాట్లాడడం చాలా కష్టం” అంటూ ప్రియాంక చెప్పిన మాటలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక డైరీ మెయింటైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. ‘వారణాసి’ చిత్రంలో ప్రియాంకనే హీరోయిన్ అని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఆమె ‘మందాకిని’ పాత్రలో కనిపించనున్నారు.ఇప్పటికే విడుదలైన ఆమె ఫస్ట్‌లుక్ భారీ హైప్ క్రియేట్ చేస్తుంది. గుహలో దేవతా విగ్రహాల మధ్య చీర కట్టుకుని గన్ పట్టుకుని కనిపించిన మాస్ అవతారం అందరినీ ఆశ్చర్యపరిచింది. టీజర్‌లో ప్రత్యేకంగా చూపించిన చిన మస్తానా దేవి టెంపుల్ సన్నివేశం చర్చనీయాంశమైంది. ప్రమాదంలో చిక్కుకున్న ప్రియాంకను హీరో కాపాడే విజువల్స్ థ్రిల్లింగ్‌గా అనిపించాయి. చిన మస్తా దేవి తాంత్రిక పూజల్లో ఆరాధించే రౌద్రరూపం. ముఖ్యంగా టిబెటిన్ తాంత్రిక సంప్రదాయాల్లో ఈ దేవికి ప్రత్యేక స్థానం ఉంది.చిన్న మస్తా, ప్రచండ చండిక, జోగని మా వంటి పేర్లతో కూడా పిలుస్తారు. టీజర్‌లో ఈ దేవి విగ్రహం చుట్టూ రూపొందించిన సన్నివేశాలు సినిమాకు కీల కం కానున్నాయని తెలుస్తోంది. ఈ పాత్రను రాజమౌళి ఎలా తీర్చిది ద్దారు? ఏ ప్రపంచంలో ఆమె పాత్ర విస్తరించబోతుంది? అనేదాని పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. మహేష్ - రాజమౌళి కాంబినేషన్‌కు తోడు ప్రియాంక చోప్రా శక్తివంతమైన పాత్రలో కనిపించ బోతుండటంతో ‘వారణాసి’పై ఎక్స్‌పెక్టేషన్స్ మరింత పెరిగాయి.

# ‘పతక’ సంతోషం!



**వేద న్యూస్, డెస్క్:**

పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలతో వార్తల్లో నిలిచిన మను భాకర్ మళ్లీ ఆ స్థాయిలో రాణించలేకపోతోంది. 10 మీటర్ల ఎ యిర్ రైఫిల్ విభాగంలో పతకాల వేట కొన సాగిస్తుందనుకుంటే అనూహ్యంగా ఖాళీ చేతులతో నిష్క్రమిస్తోంది. తాజాగా ఐఎస్ఎస్ ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భాకర్ నిరా శపరిచింది. కైరో వేదికగా జరిగిన టోర్నీ లో విఫలమైన ఆమె ఓటమిపై ఆసక్తికర వ్యా ఖ్యలు చేసింది. ఎవరైనా ప్రతిరోజూ విజ యం సాధించలేరు, ఈ పరాజయం నుంచి చాలా నేర్చుకుంటాను అని అంటోంది విశ్వ విజేత.ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో పతకం సాధించేలా కనిపించిన మను భాకర్ ఫైనల్లో తేలిపోయింది. ర్యాపిడ్ ఫైరింగ్ క్వాలిఫికేషన్‌లో 586 పాయింట్లు సాధించి టాప్-8లో నిలిచిన ఆమె.. ఫైనల్లో గురి తప్పింది. కేవలం రెండు సార్లు మాత్రమే లక్ష్యాన్ని సాధించి నిరాశ పరిచింది. తన ఓటమిపై స్పందించిన ఆమె.. ‘వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో పత కాలే లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ, మెరుగైన ప్రదర్శనే చేయలేదు. మంచి స్కోర్లే సాధించినా.. పోడియం మీద నిల్చోలేకపోయాను. నా టీమ్మేట్ ఇషా పతకం సాధించింది.క్రీడల్లో మనం ప్రతి సారి, ప్రతిరోజు గెలవలేం. కొన్ని సార్లు ఓడిపోతాం కూడా. నావరకైతే ఈ పోటీ ల్లో భారత్‌కు పతకం రావ డమే ముఖ్యం. ఆ మెడల్ నేను సాధిం చినా.. మరొకరు గెలిచినా సంతోషమే. అందుకే ఇషా విజయా న్ని నేను ఎంజాయ్ చే స్తున్నా. ఏ స్పోర్ట్స్‌లో అయినా ఇలానే ఉండా లి. ఇక దివ్యాంగులైన అథ్లెట్ల ప్రదర్శ నను ఎంతో మెచ్చుకోవాలి. వైకల్యాన్ని ఎదిరి ంచి విశ్వ వేదికలపై సత్తా చాటుతున్న వాళ్లు మనందరికి స్ఫూర్తిదాయకం’ అని వెల్లడించింది. ఇదే పోటీల్లో తెలంగాణ షూటర్ ఇషా సింగ్ సత్తాచాటి కాంస్యం కైవసం చేసు కుంది.

**విశ్వక్రీడల్లో2 కాంస్యాలతో..**

ఒలింపిక్స్ పతకం కోసం సుదీర్ఘ సాధన చేసిన మను భాకర్ నిరుడు తన కల నిజం చేసుకుంది. మాజీ షూటర్, కోచ్ జస్పాల్ రాణా శిక్షణలో రెండు కాంస్యాలతో చరిత్రను తిరగరాసింది. పారిస్ ఒలింపిక్స్‌లో మను భాకర్ దేశం తరఫున పతక బోణీ కొట్టింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మహిళల వ్యక్తిగత విభాగంలో కంచు మోత మోగించింది. ఆ తర్వాత సరబ్‌జోత్ సింగ్ జతగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లోనూ సత్తా చాటిన ఆమె దేశానికి రెండో కాంస్యం అందించింది.దాంతో, ఒకే విశ్వక్రీడల్లో రెండు కాంస్యాలతో చరిత్ర పుటల్లో నిలిచింది మను. అయితే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో ఆమె గన్ అంతగా పేలలేదు. ఒలింపిక్ ఛాంపియన్‌గా మరిన్ని పతకాలు పట్టేస్తుందనుకుంటే.. తను మాత్రం ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ కాంస్యంతో సరిపెట్టుకుంది.

# ఇదేమీ పిచ్?.. కోహ్లీ, సచిన్‌కూ కష్టమే!




**వేద న్యూస్ డెస్క్:**

ఈడెన్ గార్డెన్స్‌లో భారత జట్టు అనూహ్య ఓటమిపై.. టర్నింగ్ పిచ్‌ను కోరడంపై విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రత్యర్థిని బోల్తా కొట్టించబోయి టీమిండియా క్రికెటర్లే బొక్కబోర్లాపడడం, స్వదేశంలో పరాజయం పాలవ్వడాన్ని మాజీలు తేలికగా తీసుకోలేకపోతున్నారు. టెస్టు క్రికెట్ భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారంటూ కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐను కడిగిపారేస్తున్న హర్భజన్ సింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత పిచ్‌లపై విమర్శనాస్త్రాలు సంధించిన అతడు.. ఇప్పుడు దిగ్గజ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలు సైతం వికెట్ కాపాడుకోలేరని భజ్జీ అంటున్నాడు.కోల్‌కతా టెస్టులో స్వల్ప లక్ష్యాన్ని భారత జట్టు ఛేదించలేకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. పట్టుబిగినట్టే బిగించి.. మ్యాచ్‌ను చేజేతులా దక్షిణాఫ్రికాకు అప్పగించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదంటున్నాడు హర్భజన్ సింగ్. ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై మండిపడుతున్న ఈ లెజెండరీ స్పిన్నర్ యూట్యూబ్ ఛానెల్లో మాట్లాడుతూ సంచలన కామెంట్లు చేశాడు.‘టెస్టు క్రికెట్ ఇప్పటికే చచ్చిపోయింది. ఇప్పటికీ సుదీర్ఘ ఫార్మాట్‌లో మజా ఉందని నేను అనుకోవడం లేదు. భారత టెస్టు క్రికెట్‌లో కూడా జీవం లేదని నా అభిప్రాయం. ఇంగ్లండ్‌లో మ్యాచ్‌లు అద్భుంగా జరిగాయి. అక్కడ పిచ్‌లు సవాల్ విసరడం.. మన కుర్రాళ్లు గొప్పగా ఆడి మ్యాచ్‌లు గెలవడాన్ని అందరం ప్రశంసించాం. నిజమైన టెస్టు క్రికెట్ అంటే అదే. ఆ ఆటలో థ్రిల్ ఉంటుంది. ఆటగాళ్లే కాదు మనం కూడా పోరాడినట్టుగా ఫీలవుతాం. కానీ, మనదేశంలోని పిచ్‌లు మాత్రం మరీ దారుణం. ఇక్కడ బౌలింగ్ చేస్తే బంతి అనూహ్యంగా టర్న్ అవుతోంది. బ్యాటర్లకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. టెక్నిక్ ఎంత బాగన్నా సరే ఔటవుతున్నారు.అంతెందుకు.. సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలు సైతం ఇప్పుడు మన పిచ్‌లపై వికెట్ కాపాడుకోలేరు. ఎందుకంటే.. ఒక బంతి బౌన్స్ అయితే.. మరో బంతి స్లోగా వస్తోంది. ఆ తర్వాతి బంతి నమ్మశక్యంకాని విధంగా టర్న్ అవుతోంది. అంతే.. బ్యాటర్లు వికెట్ కోల్పోతున్నారు. ఇలాంటి అర్థం కాని వికెట్ మీద వారి టెక్నిక్ పని చేయడం లేదు. ఆటగాళ్ల పొరపాట్లు కాదు పిచ్ ఒక్కటే అన్నీ నిర్ణయిస్తోంది. ఇది మనదేశంలో కొత్తేమీ కాదు. ఏళ్లుగా ఇలానే కొనసాగుతోంది’ అని భజ్జీ పేర్కొన్నాడు.

# అనంత్ అంబానీ ‘వంతారా’పై డాక్యుమెంటరీ..

**వేద న్యూస్ డెస్క్ :**



రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంత్ అంబానీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జంతు సంరక్షణ ప్రాజెక్ట్ వంతారాపై ప్రత్యేక డాక్యుమెంటరీ తెరకెక్కింది. ‘వంతారా సాంక్చురీ స్టోరీస్’ పేరుతో ఈ డాక్యుమెంటరీ రాగా ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ డాక్యు ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. సాంక్చురీ స్టోరీస్ సీజన్- 1 పేరుతో ఈ సిరీస్‌ను విడుదల చేశారు. ప్రపంచంలోని అతిపెద్ద జంతు సంరక్షణ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ ప్రాజెక్టును దాని వెనుక ఉన్న కృషిని, లక్ష్యాలను ఈ డాక్యుమెంటరీ ప్రజలకు పరిచయం చేయనుంది.